అన్నదాతలకు అండగా ఆర్బీకేలు

- వ్యవసాయ సూచనలు, సలహాలు అందజేస్తున్న సిబ్బంది
- రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు లభ్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



తంగడంచెలో ఏర్పాటుచేసిన రైతుభరోసా కేంద్రం

జూపాడుబంగ్లా: అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వ్యవసాయం దండగా అన్న గత పాలకుల చెంప చెల్లుమనిపించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పండగ చేసి చూపుతున్నారు. ఇక రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతల ముంగిటకే అన్ని సేవలూ అందిస్తూ ఆపద్బాంధవుడిగా నిలుస్తున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 74 ఆర్బీకే(రైతు భరోసా కేంద్రాలు)లు ఉన్నాయి. ఒక్కో ఆర్బీకేలో విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, ఫిషరీస్ అసిస్టెంట్లు ఉంటారు. వీరు తమ శాఖల ఉన్నతాధికారుల సూచనల మేర కు రైతులకు అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, పశుసంవర్ధక, మత్స్యశాఖలకు సంబంధించి 60 రకాల సేవలను రైతులకు అందిస్తారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పాటు యాంత్రీకరణ వాడకంపై కూడా ప్రాథమిక శిక్షణ ఇస్తున్నారు. వ్యవసా యం అనుబంధ రంగాల అధికారులు, శాస్త్రవేత్తలు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కేంద్రాల్లో దృశ్య, శ్రవణ మాధ్యమాలతోపాటు మినీ భూసార పరీక్షా ల్యాబ్, విజ్ఞాన ప్రదర్శనలు, మినీ లైబ్రరీ వంటివి రైతులకు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు సహజ ప్రకృతి ఉత్పత్తుల తయారీ, ప్రదర్శన ఉంటోంది. ఆసక్తి ఉన్న రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తారు. రైతుల ధాన్యాన్ని గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తున్నారు. పండ్ల తోటల పెంపకంతోపాటు పశుసంవర్ధకశాఖ ద్వారా రైతులకు వర్తించే పలు రకాల సేవలు ఆర్బీకే ద్వారా అందుతున్నాయి. పట్టుపరిశ్రమ సాగు వల్ల రైతులకు కలిగే లాభాలను వివరించి వారు మల్బరీ సాగుపై ఆసక్తి కలిగేలా చేస్తున్నారు.

సకాలంలోనే..

రైతు భరోసా కేంద్రాల్లో సేవలు సకాలంలోనే అందుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కావాల్సిన రైతులు ముందే ఆర్బీకే వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటుచేసిన 'డిజిటల్ కియోస్క్' ద్వారా ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకోవాలి. ఆ తర్వాత రెండు, మూడు రోజుల్లోనే కావాల్సినవి రైతులకు అందుతాయి.

నందికొట్కూరు నియోజకవర్గంలో ఆర్బీకేల వివరాలు..

మండలం	ఆర్బీకేలు
నందికొట్కూరు	14
జూపాడుబంగ్లా	11
మిడుతూరు	14
పగిడ్యాల	10
పాములపాడు	14
కొత్తపల్లి	11

రైతుభరోసా కేంద్రాలతో ఊరట



గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేశాక ఉన్న ఊళ్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు లభిస్తుండటంతో కాస్త ఊరట లభిస్తోంది. వీటి కోసం గతంలో పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆర్బీకేల్లో పేరు నమోదు చేసుకుంటే చాలు ఎలాంటి ఇబ్బందు ల్లేకుండా విత్తనాలు, ఎరువులు ఇస్తున్నారు.

– భీమశేఖర్, రైతు, మిట్టకందాల

ఉన్న ఊళ్లోనే ధాన్యం అమ్ముకునే వెసులుబాటు



దిగుబడులను గిట్టుబాటు ధరకు ఆర్బీకేలోనే విక్రయించుకునే వెసులుబాటు ఉంది. రాయితీపై యంత్రపరికరాలు పొందే అవకాశం లభించింది. ఈ క్రాప్‌బుకింగ్ కోసం మండలకేంద్రాలకు పరుగులు తీయకుండా ఉన్న ఊళ్లోనే నమోదు చేయించుకునే అవకాశం కలిగింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతే సీఎం వెంటనే నష్టపరిహారం మంజూరు చేసి రైతులను ఆదుకుంటున్నారు. అంతే కాకుండా పెట్టుబడి సహాయంగా రైతుభరోసా నిధులు మంజూరు చేయటం హర్షనీయం. టీడీపీ పాలనలో రైతుల అభివృద్ధికి చంద్రబాబునాయుడు ఎలాంటి సహాయ, సహకారాలు అందించలేదు.

– చంద్రశేఖర్‌రెడ్డి, రైతు గువ్వలకుంట్ల

ఆర్బీకేలతో రైతులకు ప్రయోజనం



రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఉపయోగకరంగా ఉన్నాయి. విత్తనాలు, ఎరువుల కోసం పట్టణాలకు వెళ్లాల్సిన బాధ తప్పింది. రైతులకు ఉన్న ఊళ్లోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నాం. పంటల నమోదు, బీమా, నష్టపరిహారం, రైతుభరోసా తదితర సంక్షేమ పథకాలను రైతులకు సకాలంలో అందేలా ఆర్బీకే సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారు.

– విజయశేఖర్, ఏడీఏ, నందికొట్కూరు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాములపాడు: నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై చర్యల తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్‌ఎస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కర్నూలు– గుంటూరు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డులు కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా పట్టుబడితే రూ.5 వేలు, పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే రూ.1,500, హెల్మెట్ లేకుండా టూ వీలర్ నడిపితే రూ.1,000లు, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే రూ.1,500లు, ట్రిపుల్ రైడింగ్‌కు రూ.1,000లు, రిజిస్ట్రేషన్ లేని వాహనాలకు రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తామన్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు రూ.40 వేలు జరిమానా తప్పదని హెచ్చరించారు.

జగనన్న కాలనీలో నీటి వసతికి చర్యలు

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ జగనన్న కాలనీలో నీటి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం కాలనీలో జరిగే పనులను ఆయన పరిశీలించారు. నీటి సమస్య తలెత్తడం వల్ల ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్న విషయం గ్రహించి వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్‌తో మాట్లాడారు. మార్చి 17లోగా ఇళ్ల నిర్మాణాల టార్గెట్‌లను పూర్తి చేయాలని జిల్లా అధికారులు ఆదేశాలు ఉన్నాయని చెప్పడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్పందించి వెంటనే జీఎల్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌లకు నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఆయన వెంట ఈఓఆర్డీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, సర్పంచ్ రాజేశ్వరి ఉన్నారు.

క్లుప్తంగా

శ్మశానవాటికలో అంగన్‌వాడీ కేంద్రం వద్దు


పునాదులను పరిశీలిస్తున్న దళితులు

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో నివాసగృహాల మధ్యనున్న శ్మశానవాటికలో అంగన్‌వాడి కేంద్రాన్ని నిర్మించవద్దంటూ పారుమంచాల గ్రామ దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ భవనం కోసం తవ్విన పునాదుల గుంతలను శుక్రవారం వారు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ నాగన్న, ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మద్దమ్మ, పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌కు వినతిపత్రాలు అందజేశారు. శ్మశానవాటికలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామదళితులు అధికారులను కోరారు.

అంగన్‌వాడీ వర్కర్ల నిరసన


ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

జూపాడుబంగ్లా: తమను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన నిర్వహించారు. వారికి మద్దతుగా రమేష్ బాబు మాట్లాడారు. నిరసనల్లో అంగన్‌వాడీ వర్కర్ల నాయకురాళ్లు కమల, కాత్యాయనీ, నాగేశ్వరరావు, వనజ, వి.రమణమ్మ, ఎన్వీ రమణమ్మ, శ్రీలక్ష్మి, నూర్జహాన్, వెంకటలక్ష్మి, సువర్ణ, రవణమ్మ, మహాదేవి, సరోజ, శైలజ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి సామగ్రి వితరణ


మాట్లాడుతున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: స్థానిక భవిత కేంద్రానికి పల్లె ప్రియాంక సేవా సమితి రూ.10 వేల విలువ చేసే స్టీల్ సామగ్రి, టేబుల్స్ విరాళంగా అందించింది. ఈ సందర్భంగా ఎంఈఓ సుభాన్ మాట్లాడుతూ చిన్నారుల కోసం సామగ్రి వితరణ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ వెంకటేశ్వర్లు, ఐఈఆర్‌టీలు రామకృష్ణయ్య, అరుణకుమారి, సీఆర్‌పీ మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాల్లో జాప్యం తగదు


ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న దృశ్యం

మిడుతూరు: జగనన్న కాలనీలలోని ఇంటి నిర్మాణాల్లో జాప్యం తగదని హౌసింగ్ డీఈ ప్రభాకర్ హెచ్చరించారు. ఎంపీడీఓ జీఎన్‌ఎస్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం మండల పరిధిలోని కలమందలపాడు, మిడుతూరు, రోళ్లపాడు గ్రామాల జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమేష్, వీఆర్వో రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి అస్రఫ్ బాషా, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతిచెందిన సుబ్బరాయుడు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో కర్నూలు–నంద్యాల బైపాస్ రోడ్డులోని కుందూ నది బ్రిడ్జి సమీపంలో శుక్రవారం వేకువజామున సుబ్బరాయుడు (45) అనుమానాస్పదంగా మృతి చెందాడు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ మండలం ఎం.కృష్ణాపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు గ్రామంలో ఖాళీగా తిరిగేవాడు. గురువారం ఇంట్లో చెప్పకుండా నంద్యాలకు వచ్చాడు. వేకువజామున బ్రిడ్జి సమీపంలో మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సుబ్బరాయుడు చెవి, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావమైనట్లు గుర్తించామని ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడమే మృతికి కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని సీఐ పేర్కొన్నారు.

ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న ఉత్సవమూర్తులు


రుద్రవరంలో బండలాగుతున్న ఎద్దులు

రుద్రవరం: పార్వేట ఉత్సవమూర్తులు జ్వాలానరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామి వారి పల్లకీ గురువారం రాత్రి కాలిబాటన అహోబిలం బయలుదేరింది. ఈ క్రమంలో ఆళ్లగడ్డ–అహోబిలం రహదారిలోని తుండ్లవాగు (సాయిబాబ మందిరం) వద్ద ఇస్కాన్ నిర్వహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో పల్లకీని కొలువుదీర్చారు. రాత్రి అ క్కడ ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించిన అనంతరం శుక్రవారం తెల్లవారు జామున అహోబిలం పయనమయ్యారు. ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి,ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి అక్కడికి చేరుకొని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి బోయిలతో పాటు పల్లకీ మోశారు. అలాగే పల్లకీ అహోబిలం చేరుకునే వరకు వెంట నడిచారు. కాగా స్వామి వార్ల పల్లకీ రాక సందర్భంగా మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. బొమ్మలు, గాజులు, మిఠాయిల అంగళ్లు వెలిశాయి. వాటి వద్ద కొనుగోలుదారుల సందడి నెలకొంది. అలాగే బెస్త కాలనీ వాసులు ఎద్దుల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లోని పలు గ్రామాల నుంచి 22 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమాలను వెండిని బహుమతిగా అందజేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ


మహానందిలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో కొలువైన శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి శుక్రవారం రాత్రి పల్లకీలో కొలువై ఆలయ ప్రాకారాల్లో విహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేపట్టారు. ఉత్సవానికి ముందు ప్రత్యేకంగా అలంకరించిన గోమాతను ఉంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం చేపట్టారు.

రైతులు అభ్యంతరాలు తెలపాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ టి.నిశాంతి

నంద్యాల(అర్బన్): నంద్యాల నుంచి జమ్మలమడుగు వరకు ఏర్పాటయ్యే 167–కే జాతీయ రహదారికి సేకరించే భూములకు సంబంధించిన రైతుల అభ్యంతరాలు ఉంటే తెలపాలని జాయింట్ కలెక్టర్ టీ.నిశాంతి తెలిపారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ రహదారికి సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ నంద్యాల నుంచి జమ్మల మడుగు జాతీయ (రెండు వరసల) రహదారి నిర్మాణంలో.. నూనెపల్లె, కానాలతో పాటు గోస్పాడు మండలంలోని చింతకుంట్ల, జూలెపల్లె, పసురపాడు, గోస్పాడు, ఒంటివెలగల గ్రామాలు, దొర్నిపాడు మండలంలోని గుండుపాపల, కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు, ఉప్పలూరు, కలుగొట్ల, జొళదరాశి, చింతకుంట, కోవెలకుంట్ల, పాట్టిపాడు, గుళ్లదుర్తి, ఉయ్యలవాడ మండలంలోని నర్సిపల్లి, అల్లూరు, మాయలూరు, రూపనగుడి, బోడెమ్మనూరు, సంజామల మండలంలోని నొస్సం గ్రామాల మీదుగా 363.71 ఎకరాలు పోతున్నాయన్నారు. భూసేకరణలో పోతున్న భూముల యజమానులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రచురణ ఈనెల 21వ తేదీ నుంచి 21రోజుల వ్యవధిలో రాత పూర్వకంగా తెలుపుకోవచ్చని చెప్పారు. రహదారి వెళ్లే గ్రామాల్లో సంబంధిత కన్సల్టెన్సీ వారు మార్చి 1 నుంచి నెలాఖరులోపు జాతీయ రహదారి వెళ్లే మార్గాన్ని ఖరారు చేస్తారని స్పష్టం చేశారు.

పాదయాత్రగా అహోబిలానికి..


పాదయాత్రగా వెళ్తున్న మాలధారులు

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలు,ప్రాంతాలకు చెందిన నృసింహ మాలధారులు దీక్ష విరమణ కోసం శక్రవారం పాదయాత్రగా అహోబిలం క్షేత్రానికి బయలుదేరారు. జనవరి 16 అహోబిలంలో నరసింహస్వామి పారువేటకు బయలుదేరే రోజున వేలాది మంది భక్తులు స్వామి వారి దీక్షబూనారు. మండల దీక్ష పూర్తి కావడంతో పాటు పార్వేట ఉత్సవమూర్తులు అహోబిలం చేరుకోవడంతో మాలాధారులు దీక్ష విరమించేందుకు కాలి బాటన అహోబిలానికి తరలివెళ్లారు.

పారిశుధ్య పనులు ముమ్మరం


పారిశుధ్య పనులు చేపడుతున్న దృశ్యం

మిడుతూరు: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి ఫరీద్‌బాషా తెలిపారు. బీసీ, ఎస్సీ, మైనార్టీ కాలనీలలో పారిశుధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లినట్లు తెలిపారు. రహదారికి ఇరువైపులా ఉన్న కంపచెట్లను జేసీబీతో తొలగించామన్నారు. అలాగే ట్యాంకులను శుభ్రం చేసి నీటికి క్లోరినేషన్ చేసినట్లు చెప్పారు.

మందులు సక్రమంగా అందజేయండి


రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ మల్లికార్జునరెడ్డి

గోస్పాడు: టీబీ, లెప్రసీ వ్యాధిగ్రస్తులకు మందులు సక్రమంగా అందేలా చూడాలని అసిస్టెంట్ జిల్లా అధికారి డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వచ్చేవారికి అన్ని రకాల పరీక్షలను నిర్వహించి రోగ నిర్ధారణ చేయాలన్నారు. టీబీ,లెప్రసి, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మందులు సకాలంలో వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయాలన్నారు. వారికి మందులతో పాటు నెలకు రూ.500 ఇస్తుందని, ఆ సొమ్ము వారి ఖాతాల్లోకి జమ చేస్తుందని చెప్పారు. అనంతరము సిబ్బంది హాజరు రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. డాక్టర్ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు ముదిరితే అంగవైకల్యం


రోగిని పరిశీలిస్తున్న వైద్యులు

నంద్యాల(అర్బన్): కుష్టు వ్యాధి ముదిరి నరాలకు సోకడం వల్ల అంగవైకల్యం ఏర్పడుతుందని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ బాలజీ తెలిపారు. వ్యాధి సోకిన వారు ప్రాథమిక దశలోనే మందులు వాడితే తగ్గుతుందన్నారు. స్థానిక హరిజనవాడ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం కుష్టువ్యాధితో అంగవైకల్యం ఏర్పడిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకిన వారు సకాలంలో మందులు తీసుకోకపోవడం వల్ల వ్యాధి ముదిరి నరాలకు సోకుతుందన్నారు. అంగవైకల్యం ఏర్పడిన వారికి నెల్లూరు జిల్లాలోని డీఎఫ్ఐటీ (డెమెన్ ఫౌండేషన్ ఇండియన్ ట్రస్ట్)లో రీ కన్‌స్ట్రక్షన్ సర్జరీ చేస్తున్నామని, అందుకోసం నిర్వహించే స్క్రీనింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సభ, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: ఇంటర్మీడియెట్ విద్యను మధ్యలో ఆపేసిన విద్యార్థులకు ఇంటర్ విద్యామండలి మరో అవకాశాన్ని కల్పించినట్లు స్థానిక ప్రభుత్వ ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ పూర్తి చేసుకోవడానికి ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిన్నారుల వివరాలు సేకరించండి


సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ మేరీ

కొత్తపల్లి: మండల వ్యాపంగా ఉన్న చిన్నారుల వివరాలు సేకరించాలని ఎంపీడీఓ మేరీ సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ఎస్‌బీజీ ఆయుస్మాన్ భారత్ కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 14 ఏళ్ల వయసులోపు చిన్నారులు ఏ గ్రామంలో ఎంతమంది ఉన్నారో మూడు రోజుల్లోగా వివరాలు సేకరించి, జాబితా అందజేయాలన్నారు. అలాగే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే, ఆయుస్మాన్ భారత్ కార్డుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి


పట్టభద్రులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వరరెడ్డి, పార్టీ నాయకులు గ్రాడ్యుయేటర్లను కోరారు. శుక్రవారం వారు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, కోసిక తిరుమలేశ్‌రెడ్డి, సర్పంచ్ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపాలి


ఆర్టీసీ ట్రాఫిక్ కంట్రోలర్‌ను కోరుతున్న విద్యార్థులు

జూపాడుబంగ్లా: పాఠశాలలు, కళాశాలల సమయానికి పోతులపాడు, చాబోలు, 80 బన్నూరు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని పలువురు విద్యార్థులు ఆర్టీసీ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో విద్యార్థులు ఆర్టీసీ కంట్రోలర్‌ను కలిసి తమ సమస్యను విన్నించారు. సకాలంలో బస్సుల్లేక తరగతులకు హాజరు కాలేకపోతున్నామన్నారు.

చెక్‌ల పంపిణీ


రైతులకు చెక్ అందజేస్తున్న మేనేజర్ శ్రీనివాసులు

ఆత్మకూరు: విజయ డెయిరీకి పాలు పోసే రైతులకు బోనస్ చెక్‌లను పంపిణీ చేశారు. శుక్రవారం మండలంలోని అమలాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో డెయిరీ బీఎంసీసీ మేనేజర్ శ్రీనివాసులు, ఏజెంట్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 2022 జనవరి నుంచి డిశంబర్ వరకు డెయిరీకి పాలు పోసిన రైతులకు లీటరుకు రూ.2 చొప్పున బోనస్‌గా అందించామని మేనేజర్ తెలిపారు. గ్రామంలోని పాడి రైతులకు బోనస్ మొత్తం రూ.58,500 చెక్‌ల రూపంలో అందించామన్నారు.

రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి

ఆత్మకూరు: ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మొండిచేయి చూపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి రణధీర్ ఆరోపించారు. శుక్రవారం సీపీఎం నాయకులు స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రణధీర్ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను కేంద్రప్రభుత్వం గాలికొదిలేశారన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు తక్కువ నిధులు కేటాయించిందన్నారు. అనంతరం బడ్జెట్‌కు వ్యతిరేకంగా పీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి నరసింహ నాయక్, నాయకులు యేసురత్నం, రామ్‌నాయక్, ఇస్మాయిల్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

28న శాప్ యోగా లీగ్ ఫేజ్–2 పోటీలు

నంద్యాల(సిటీ): రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన యోగా లీగ్ ఫేజ్–2 పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రాజు శుక్రవారం తెలిపారు. కర్నూలులోని డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగా పోటీలు సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి ఆధ్వర్యంలో జరగనున్నాయన్నారు. ఈ పోటీలు అండర్ 8–10, అండర్ 12–14, అండర్ 14–17 విభాగాల్లో జరుగుతాయని చెప్పారు. ఆసక్తి కలిగి న అభ్యర్థులు శాప్ లీగ్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9885240365 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలు

మహానంది: ఎమ్మెల్సీ ఎన్నికలకు మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ జనార్ధన్ శెట్టి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 927 మంది ఓటర్లు ఉండగా అందులో డిగ్రీ పట్టభద్రులు 897, ఉపాధ్యాయ ఓటర్లు 30 మంది ఉన్నారన్నారు. తిమ్మాపురంలోని మెయిన్ స్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఏలూరుకు చెందిన సి.శ్రీనివాస్ దంపతులు రూ.1,00,005 విరాళాన్ని అందించారు. శుక్రవారం దేవస్థానం ఏఈఓ ఫణిధరప్రసాద్‌కు విరాళ చెక్కును అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.